క్లుప్తంగా

ఎంపీ గురుమూర్తి పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీలో మృతి చెందిన పైపూరి పద్మమ్మ కుటుంబ సభ్యులను శుక్రవారం తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి పరామర్శించారు. మేర్లపాక ఎస్సీ కాలనీకి చెందిన పైపూరి బత్తెయ్య భార్య పైపూరి పద్మమ్మ(55) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎంపీ గురుమూర్తి ఆ గ్రామానికి వెళ్లి, పద్మమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పద్మమ్మ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు వాసుదేవులు, శంకరయ్య, శంకర్, గాలి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలి



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం: రైతులు రసాయన రహిత ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని కృష్ణాపురం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పీఎం అజయ పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాలు రైతులకు ఉచితంగా ప్రకృతి వ్యవసాయ పనిముట్లు డ్రమ్ములు, టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం రైతులకు సబ్సిడీ జనుము, జీలుగ విత్తనాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభ

వరదయ్యపాళెం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి శనివారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో గత ఏడాది జరిగిన పనులకు సంబంధించి తనిఖీ చేపట్టనున్నారు. గతంలో జరిగిన పంచాయతీరాజ్, హౌసింగ్, అటవీశాఖ, వైఎస్సార్ క్రాంతి పథకం, సమగ్ర శిక్షా అభియాన్ తదితర శాఖల్లో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నివేదిక సమాచారాన్ని తనిఖీ సిబ్బంది వెల్లడించనున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు హాజరు కావాలని కోరారు.


కొత్త చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం డిగ్రీ వరకు అయినా చదువుకోవాలన్నారు. అనంతరం జూలై 1 నుంచి కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ అరుణ విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయసుధ, ఉపాధ్యాయులు గోపాలకృష్ణన్, సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న యువనేస్తం అసోసియేషన్ సభ్యులు

శ్రీకాళహస్తి రూరల్: యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలం వేడం పంచాయతీ భైరవ ఎస్టీ కాలనీలోని 40 మంది పిల్లలకు శుక్రవారం ఉచితంగా విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఎల్‌ఐసీ యూనియన్ 74వ ఆవిర్భావం సందర్భంగా ఎల్‌ఐసీ శ్రీకాళహస్తి బ్రాంచ్ ఐసీఈయూ కార్యదర్శి సురేష్ బాబు ఆధ్వర్యంలో ఈ సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలందరూ బాగా చదువుకుని మంచి స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు. యువనేస్తం అధ్యక్షుడు మునిశేఖర్, శ్రీకాళహస్తి ఐసీఈయూ అధ్యక్షులు సాయి, సభ్యులు గోపీనాథ్, జహంగీర్, శ్రీనివాసులు, ఆనంద్, వెంకటేష్, వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీఎన్‌కండ్రిగ గ్రామం వద్ద గుంతలమయమైన రోడ్డు



తహానగర్ గ్రామం వద్ద..



అధ్వానం.. జంబుగోళం మార్గం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని జంబుగోళం గ్రామానికి వెళ్లే రోడ్డు తారురోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కేటీరోడ్డు నుంచి జంబుగోళం గ్రామానికి నాలుగు కిలోమీటర్లు ఆర్‌అండ్‌బీకి సంబంధించిన తారురోడ్డు ఉంది. రోడ్డు వెంబడి ఆర్ అనంతాపురం, జీఎస్ కండ్రిగ, పూసలపల్లి, తహానగర్, జంబుగోళం, చిన్నయగుంట, గ్రామాలున్నాయి. ఈ రోడ్డు గత సంవత్సరం కురిసిన భారీవర్షాలకు దెబ్బతిని, గుంతలమయమై అధ్వానంగా ఉంది. వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి రొచ్చురొచ్చుగా మారుతోంది. రోడ్డుపై ఉన్న గుంతలు బావులను తలపిస్తున్నాయి. రోడ్డుపై గ్రామస్తులు నడవటానికి ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహనాలు, కార్లు నడపటం కష్టమవుతోంది. వాహనచోదకుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తారురోడ్డు వేసి 15 ఏళ్లు కావస్తున్నా రోడ్డుకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారైంది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.



ఛిద్రమైన జంబుగోళం గ్రామం రోడ్డు



జీఎన్‌కండ్రిగ గ్రామం వద్ద..

కబ్జా స్థలం పరిశీలన



ఆక్రమణకు గురైన పాఠశాల క్రీడా మైదానం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు సంబంధించిన క్రీడా మైదానాన్ని ఇదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించిన స్థలాన్ని ఎంఈఓ రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డితో కలసి పరిశీలించారు. పాఠశాల కమిటీ చైర్మన్ ధనంజయులు, గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబరు 71బీలో 6 ఎకరాల 43 సెంట్లు భూమి జెడ్పీ ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం గ్రామానికి చెందిన సుబ్బానాయుడు, వెంకటప్పనాయుడు, రామానాయుడు, కృష్ణమనాయుడు విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఎకరా 70 సెంట్ల భూమిలో పాఠశాల భవనాలను నిర్మించి, మిగిలిన భూమి క్రీడామైదానంగా వాడుకుంటున్నారని చెప్పారు. ఈ భూమిలోని 50 సెంట్ల స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన పుష్పమ్మ భర్త సుందరరామనాయుడు అక్రమ మార్గంలో పాసు పుస్తకం తీసుకుని, ఆక్రమించుకున్నట్లు చెప్పారు. వీరితో పాటు మరికొందరు పాఠశాల భూమి ఆక్రమించుకున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన ఎంఈఓ రవీంద్రనాథ్ మాట్లాడుతూ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పాఠశాల భూమి ఆక్రమణ అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ మురళిమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

సీఐపై ఎస్పీకి ఫిర్యాదు

శ్రీకాళహస్తి: పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వెళ్లి మహిళపై అమానుషంగా ప్రవర్తించిన శ్రీకాళహస్తి ఒకటో పట్టణ సీఐ నరసింహారావు, ఎస్‌ఐ అరుణపై చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు శుక్రవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయం కోసం ఫిర్యాదు చేయడానికి వెళ్లి మహిళపై దురుసుగా ప్రవర్తించి, వారం రోజులు స్టేషన్ చుట్టూ తిప్పించుకుని, ఎఫ్‌ఐఆర్ ఫైల్ చేయకుండా అమర్యాదగా ప్రవర్తించిన సీఐ, ఎస్‌ఐపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్పీ వారికి హామీ ఇచ్చారు.

స్కూల్‌బస్సు డ్రైవర్లకు అవగాహన



మాట్లాడుతున్న ఎంవీఐ దామోదరనాయుడు

శ్రీకాళహస్తి: పట్టణంలోని మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో శుక్రవారం శ్రీకాళహస్తి పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలల బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ దామోదరనాయుడు మాట్లాడుతూ పాఠశాలల బస్సులు నడిపే డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అతివేగంగా బస్సు నడపరాదని సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. విధిగా బస్సులో ఒక అటెండర్ ఉండాలన్నారు. వాహనం నడపడంలో డ్రైవర్లకు కనీసం ఐదేళ్ల అనుభవం ఉండి, 60 సంవత్సరాలు మించకుండా ఉండాలని సూచించారు. వాహన కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవడం పిల్లలను క్షేమంగా పాఠశాలలకు వెళ్లి రావడానికి వీలు ఉంటుందన్నారు. పాఠశాలల యజమాన్యాలు, డ్రైవర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు.

నేటి నుంచి వారాహి నవరాత్రులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో వెలసిన సర్వ మంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వారాహి నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు నిర్వహించే అభిషేకంలో పాల్గొనదలచిన వారు రూ.300 చెల్లించి రసీదు పొందాలని కోరారు.

కుక్కలకు ఉచిత వ్యాక్సిన్

నారాయణవనం: పెంపుడు కుక్కల కాటుతో రేబీస్ వ్యాధి సోకకుండా ఉచితనిరోధక టీకాలను వేయడానికి ఏర్పాట్లు చేసినట్లు పశువైద్యాధికారులు భార్గవి, కుమార్ తెలిపారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పెంపుడు కుక్కలకు టీకాలను నారాయణవనంలోని పశు వైద్యశాలలో వేయించుకోవాలని వారు కోరారు.

నేడు గ్రామసభ

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో శనివారం పంచాయతీ పాలకవర్గం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ బసిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు సచివాలయ ప్రాంగణంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా అభివృద్ధి పనులు, సమస్యల గురించి చర్చ జరిగే గ్రామసభకు హాజరు కావాలని ఆయన కోరారు.

రసాయన రహిత సేద్యం చేయాలి

కేవీబీపురం(వరదయ్యపాళెం): రసాయన రహిత సేద్యం వైపు రైతన్నలు అడుగులు వేయాలని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. కేవీబీపురం మండలంలోని రాయపేడు గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పీఎంఏజేఏవై పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాల రైతులు 199 మందికి ఉచితంగా టార్పాలిన్ పట్టలను పంపిణీ చేశారు. సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలను అందజేశారు.

జాబ్‌కార్డుదారులందరికీ పనులు కల్పించాలి



పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధిహామీలో జాబ్‌కార్డు దారులందరికీ పనులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవమాలలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ కూలీలకు రూ.300 వేతనం వచ్చేలా పనుల్లో కొలతలపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల పొలాల్లో నీటి గుంటలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇలా చేస్తే రైతుల వ్యవసాయ బోర్లు, బావులకు భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలన్నారు. రోజూ ఉదయం 6 గంటలకు పనులు ప్రారంభించాలన్నారు. ప్రతి రోజు ఏర్పేడు మండలంలో 4 వేల మంది కూలీలు పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీలో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులకు మామిడి, పూలు, మునగ తోటల పెంపకం చేయాలన్నారు. పనులు చేపట్టని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, జేఈ బాలాజీరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గుణశేఖర్

సత్యవేడు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్ సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని మదనంబేడు ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. డాక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, డయేరియా తదితర వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారులు అతిసార వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. పిల్లలు భోజనానికి ముందు, తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. వంట చేసేటప్పుడు, మల మూత్ర విసర్జన సమయంలో చేతులు శుభ్రం చేసుకోవాలని స్పష్టం చేశారు. నీటి తొట్టెలు, టైర్లు, టెంకాయ చిప్పల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు గురునాథం, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి బడిలో ఉండాలి



రాజులకండ్రిగలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ ప్రేమలత

ఏర్పేడు: ప్రతి విద్యార్థి బడిలో ఉండాలని ఎంఈఓ ప్రేమలత అన్నారు. శుక్రవారం మండలంలోని శివగిరి ఎస్టీ కాలనీలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఎస్టీ కాలనీల్లో పిల్లలు చదువుకు దూరంగా ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను పెంచాలని చెప్పారు. అలాగే మండలంలోని రాజులకండ్రిగ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజ గంగాధర్, ఉపాధ్యాయుడు కందస్వామి, సీఆర్పీలు వెంకటమునిరెడ్డి, మునీశ్వర్, గురుప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'నేను బడికి పోతా'



నాగలాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు

నాగలాపురం: మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు గ్రామాల బాట పట్టి 'నేను బడికి పోతా' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మండలంలోని గోలవారి కండ్రిగ గ్రామంలో మండల విద్యాశాఖ అధికారి జనార్ధన రాజు, ఉపాధ్యాయులు కలిసి శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమం ద్వారా ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ విద్యార్థులతో, తల్లిదండ్రులతో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం ఆదిశేఖర్, ఉపాధ్యాయులు బాలాజి, శ్రీనాథ్, దిలీప్, శివరామయ్య, చెంచయ్య పాల్గొన్నారు.



శివగిరి ఎస్టీ కాలనీలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

ఘనంగా అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరాలయంలో శుక్రవారం అమావాస్య ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి విశేషాలంకరణ చేసి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం చప్పరాలపై కొలువుదీర్చి ఊరేగించారు.

చంద్రప్రభపై పరాశరేశ్వరస్వామి విహారం

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి శుక్రవారం సాయంత్రం చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. ఉత్సవర్లు తిరుచ్చి వాహనంలో ధ్వజస్తంభం వద్ద కొలువుదీరాయి. ధ్వజస్తంభానికి అభిషేకాలను నిర్వహించిన అర్చకులు నందీశ్వరుని చిత్రపటమున్న వస్త్రాన్ని అధిరోహింపచేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 10 గంటలకు ఉత్సవర్లను స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవర్లు చంద్రప్రభ వాహనాన్ని అధిష్టించారు. సర్కారు హారతి అందుకున్న దేవరులు పురవీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఉత్సవాల్లో రెండో రోజు శనివారం సాయంత్రం సింహ వాహనం అధిష్టించి ఊరేగింపులో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



చంద్రప్రభ వాహనంపై పరాశరేశ్వరస్వామి

విద్యార్థులకు నగదు బహుమతి

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. 1989–90 సంవత్సరం పూర్వ విద్యార్థుల సౌజన్యంతో మొదటి బహుమతిగా నీలిమకు రూ.4 వేలు, రెండో బహుమతి హిమసాగర్‌కు రూ.3 వేలు, తృతీయ బహుమతి సీహెచ్ గణేష్‌కు రూ.2,500 ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానపాధ్యాయులు రాజేశ్వరి, పూర్వ విద్యార్థులు రాజశేఖర్, గిరిధన్, సుబ్రహ్మణ్యం, జ్యోతీరావ్, మణి, మల్లికార్జున, కైలాసం రవి, హరీష్, నారాయణ, మునికృష్ణ, ముఖ్యఅతిథులు వెంకటకృష్ణ, నాగశేషు, హైమవతి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందాలి

సత్యవేడు: విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని సీఐ దివాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన ఎస్ విజేతకు, సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఏ.శ్రీధర్‌కుమార్, భార్య హేమలత కలసి రూ.5వేలు, ప్రధానోపాధ్యాయులు రూ.3వేలు అందజేశారు. ఆ చెక్కులను సీఐ విద్యార్థిని, తల్లిదండ్రులకు అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ క్రమశిక్షణతో కష్టపడి చదివితే విద్యార్థుల వెంటే విజయం ఉంటుందన్నారు. విద్యార్థుల ఫలితాల ఆధారంగా పాఠశాలలకు గుర్తింపు వస్తుందన్నారు. ఉత్తమ ర్యాంకు పొందిన విద్యార్థిని ఇతర పిల్లలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 కే.రవి, ఎంఈఓ-2 ఉషా, పాఠశాల కమిటీ అధ్యక్షుడు పీజీ మునస్వామి, ప్రిన్సిపల్ వి.వాణి, ఉపాధ్యాయులు డీవీ.రాజు, సుగుణ, ఢిల్లీరాణి, దుర్గ, వందన, సురేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు



సత్యవేడు: విజేతకు నగదు అందజేస్తున్న సీఐ దివాకర్ రెడ్డి